# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 15-08-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- దేశవ్యాప్తంగా 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఈరోజు ఘనంగా జరిగాయి.
- వికసిత్ భారత్ లక్ష్య సాధనకు ఆత్మనిర్భర్ భారత్ పునాది వంటిదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఇతర దేశాలతో ఎటువంటి ఒప్పందాలు చేసుకోబోమని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు.
- భారతదేశ విదేశీ మారక ద్రవ్య నిల్వలు 693.62 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని RBI ఈరోజు వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఈరోజు ఘనంగా జరిగాయి. ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగిన ప్రధాన కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ ఉదయం ఎర్రకోట వద్దకు చేరుకున్న ప్రధానమంత్రికి.. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సహాయ మంత్రి సంజయ్ సేథ్ స్వాగతం పలికారు. అనంతరం ప్రధానమంత్రి గౌరవ వందనం స్వీకరించారు. ప్రధానమంత్రి జాతీయ జెండాను ఎగురవేసిన సమయంలో భారత వైమానిక దళానికి చెందిన రెండు MI-17 హెలికాప్టర్లు వేదికపై పూల వర్షం కురిపించాయి. అంతకు ముందు, ప్రధానమంత్రి రాజ్‌ఘాట్‌ను సందర్శించి మహాత్మా గాంధీ సమాధి వద్ద ఆయనకు నివాళులు అర్పించారు. దేశవ్యాప్తంగా జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో పలువురు కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇతర మంత్రులు జాతీయ జెండాను ఎగురవేసి ప్రసంగించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో భాగంగా ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగిన కార్యక్రమంలో ఆయన జాతిని ఉద్దేశించి మాట్లాడుతూ.. వికసిత్ భారత్ లక్ష్య సాధనకు ఆత్మనిర్భర్ భారత్ పునాది అని పేర్కొన్నారు. ఇంధన రంగంలో స్వావలంబన సాధించాలన్న ఆయన.. కేవలం పదకొండు సంవత్సరాల్లో సౌర విద్యుత్ ఉత్పత్తి 30 రెట్లు పెరిగిందన్నారు. దేశంలో 10 కొత్త అణు రియాక్టర్లు అభివృద్ధి దశలో ఉన్నాయని, 2047 సంవత్సరం నాటికి, అణుశక్తి సామర్థ్యాన్ని 10 రెట్లు పెంచాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. దేశంలోని యువత కోసం సుమారు లక్ష కోట్ల రూపాయల వ్యయంతో వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజనను ప్రారంభిస్తున్నామని ప్రధానమంత్రి ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ పథకం కింద ప్రైవేట్ రంగంలో మొదటి ఉద్యోగం పొందే యువతకు ప్రభుత్వం 15 వేల రూపాయలు ఇస్తుందని, ఈ పథకం ద్వారా 3 కోట్ల 50 లక్షల మంది యువతకు కొత్త ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలియజేస్తూ..

(వాయిస్ బైట్...30 సెకన్లు)

గడచిన 8 సంవత్సరాలుగా, ప్రభుత్వం వస్తుసేవల పన్ను విధానంలో అనేక సంస్కరణలను చేపట్టిందని, అలాగే భవిష్యత్తు కోసం మరిన్ని సంస్కరణలను తీసుకువస్తోందని నరేంద్రమోదీ అన్నారు. ఈ సంస్కరణల ద్వారా పౌరులపై పన్ను భారం గణనీయంగా తగ్గుతుందని, చిన్న పరిశ్రమలు, ఎంఎస్ఎంఇ లకు ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. రోజువారీ వినియోగ ఉత్పత్తుల ధరలు తగ్గుతాయన్నారు.

(వాయిస్ బైట్...30 సెకన్లు)

==============================

ఈ నెల 8వ తేదీతో ముగిసిన వారానికి భారతదేశ విదేశీ మారక ద్రవ్య నిల్వలు 4.75 బిలియన్ డాలర్లు పెరిగి 693.62 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా RBI ఈరోజు వెల్లడించింది. విదేశీ మారక ద్రవ్య నిల్వలు బలోపేతం కావడం దేశ స్థూల ఆర్థిక మూలాలను బలోపేతం చేయడాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొంది. అలాగే అమెరికన్ డాలర్‌తో పోలిస్తే రూపాయి బలోపేతం కావడానికి మరింత అవకాశం లభిస్తుందని తెలిపింది. ఇదిలా ఉండగా.. ఈ నెల 8వ తేదీతో ముగిసిన వారానికి, నిల్వలలో ప్రధాన భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 2.84 బిలియన్ డాలర్లు పెరిగి, 583.98 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని వివరించింది.

==============================

విరామం

==============================

రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉండే ఎటువంటి ఒప్పందాలు ఇతర దేశాలతో చేసుకోబోమని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు. ఈరోజు న్యూఢిల్లీలో దేశంలోని రైతులతో జరిగిన సంభాషణలో ఆయన మాట్లాడుతూ.. ఒప్పందం సమాన నిబంధనలపై జరగాలన్నారు. రైతుల సంక్షేమం, దేశ సంక్షేమమే అన్నింటికంటే ముఖ్యమని కేంద్ర మంత్రి ఉద్ఘాటించారు.

==============================

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత సైన్యం, ఇండో టిబెటన్ బోర్డర్ పోలీసులు ITBP, స్థానికులు కలిసి, అరుణాచల్ ప్రదేశ్ తవాంగ్‌లో 14 వేల అడుగుల ఎత్తైన ప్రదేశంలో తిరంగ మార్చ్ నిర్వహించారు. ఈ వినూత్న కార్యక్రమంలో 160 మంది గూర్ఖా దళాల సభ్యులు, 25 మంది ITBP సిబ్బంది 100 మీటర్ల జాతీయ జెండాను హిమాలయ పర్వత ప్రాంతంలో చేతులమీదుగా ఎత్తుకుని తీసుకువెళ్లారు. వీరితో పాటు తవాంగ్ జిల్లాలోని మాగో, చునా గ్రామాల నుండి సుమారు 150 మంది స్థానికులు పాల్గొన్నారు. అలాగే.. వారణాసిలోని సారనాథ్ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ టిబెటన్ స్టడీస్ నుండి 23 మంది విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు కూడా మార్చ్‌లో పాల్గొన్నారు.

==============================

భారతదేశ వస్తువుల ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన దాదాపు 7.3 శాతం పెరిగి 37.24 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ వెల్లడించింది. ప్రధానంగా ఇంజనీరింగ్ సామగ్రి, రత్నాలు, ఆభరణాలు, ఎలక్ట్రానిక్స్, ఫార్మాస్యూటికల్స్, సేంద్రియ, కర్బనేతర రసాయనాలు ఈ పెరుగుదలకు కారణమని పేర్కొంది. ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగుమతుల విలువ గత సంవత్సరం జూలై నెలలో 2.81 బిలియన్ డాలర్ల నుండి ఈ సంవత్సరం జులై నెలలో 3.77 బిలియన్ డాలర్లకు చేరుకొని 34 శాతం పెరుగుదలను నమోదు చేశాయి.

==============================

నాగాలాండ్ గవర్నర్ లా గణేశన్ కొద్దిసేపటి క్రితం కన్నుమూశారు. 80 ఏళ్ళ గణేశన్, ఇటీవల చెన్నైలోని తన నివాసంలో పడిపోవడంతో తలకు తీవ్ర గాయమై ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. అయినప్పటికీ వారం రోజులుగా ఆయన ఆరోగ్యం క్షీణిస్తూనే ఉంది. తమిళనాడులోని తంజావూరు జిల్లాలో జన్మించిన గణేషన్.. భారతీయ జనతా పార్టీలో చేరడానికి ముందు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ద్వారా తన రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించారు. తరువాతి కాలంలో ఆయన తమిళనాడు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగాను, తరువాత రాజ్యసభ సభ్యుడిగాను సేవలందించారు.

==============================

ఇనుప ఖనిజం అక్రమ ఎగుమతి కేసుకు సంబంధించి కర్ణాటక శాసనసభ్యుడు సతీష్ కృష్ణ సైల్, ఆయనకు సంబంధించిన సంస్థలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ED) ఈరోజు సోదాలు నిర్వహించింది. ఈ సోదాల్లో 1.68 కోట్ల రూపాయల నగదు, 6.75 కిలోల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు ఈడీ వర్గాలు వెల్లడించాయి.

గడచిన రెండు రోజుల్లో కార్వార్, గోవా, ముంబై, న్యూఢిల్లీలోని వివిధ ప్రదేశాలలో మనీలాండరింగ్ నిరోధక చట్టం (PMLA) 2002 కింద సోదాలు నిర్వహించినట్టు పేర్కొన్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇతర రాష్ట్రాల్లో నివసిస్తున్న బీహార్ కు చెందిన వలస కార్మికులు ముఖ్యమైన పండుగల సమయాల్లో తమ సొంత ప్రాంతాలకు ప్రయాణించడాన్ని సులభతరం చేయాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ఇందుకోసం 35.64 కోట్ల రూపాయల మొత్తాన్ని ఖర్చు చేయనున్నామని తెలిపారు. ఈ ప్రణాళిక ప్రకారం, ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం (PPP) విధానంలో అంతర్రాష్ట్ర బస్సు రవాణా సేవలను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభిస్తుంది. దేశంలోని కొన్ని ప్రధాన నగరాల నుండి బీహార్‌కు మరిన్ని బస్సులు ఏర్పాటు చేయడంతో పాటు ఛార్జీల నియంత్రణకు చర్యలు చేపడుతుంది. బస్ ఆపరేటర్లను ప్రోత్సహించడానికి, ప్రభుత్వం ఒక్కో సీటుకు 150 రూపాయల నుండి 300 రూపాయల వరకు గ్రాంట్లను అందజేస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =